# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సీఐఐ భాగస్వామ్య సదస్సు పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే సుమారు 16 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో అభివృద్ధి చెందాలన్నది ఎన్డీయే కూటమి ప్రభుత్వ అభిమతమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.
- ❖ రాజధాని అమరావతిలో 55 వేల కోట్ల రూపాయల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి పి. నారాయణ చెప్పారు.
- ❖ సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా విశాఖ - విజయవాడ మధ్య 12 జన్ సాధారణ్ రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

====================

సీఐఐ భాగస్వామ్య సదస్సు పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే సుమారు 16 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. పెట్టుబడులు, వాట్సాప్ గవర్నన్స్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికే వచ్చాయని, పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందన్నారు. ఇక నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందని, ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీటిని పోలవరం ద్వారా నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకోవడం తప్పు కాదని స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించి త్వరలోనే జాతికి అంకింతం చేస్తామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాపాడుకున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

====================

తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో అభివృద్ధి చెందాలన్నది ఎన్డీయే కూటమి ప్రభుత్వ అభిమతమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో మంత్రి పాత్రికేయులతో ఈ రోజు మాట్లాడుతూ... పోలవరం వద్ద వరదనీరు వాడుకోకుంటే నీళ్లన్నీ సముద్రం పాలవుతాయని, ఈ ఏడాది కూడా 4 వేల 600 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని గుర్తు చేశారు. పోలవరం - నల్లమల సాగర్‌కు ఎలాంటి అభ్యంతరాలు చెప్పొద్దని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం - నల్లమల సాగర్ వల్ల తెలంగాణ రాష్ట్రానికి కూడా ఉపయోగం ఉందని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================

అమరావతి రాజధాని ప్రాంతంలో 55 వేల కోట్ల రూపాయల పనులు వేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ చెప్పారు. అమరావతి మండలం కర్లపూడిలో స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ తో కలిసి రైతుల నుంచి మంత్రి నారాయణ అంగీకార పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా నగరం, రైల్వే ట్రాక్ వంటి నిర్మాణాల కోసం రెండవ విడత భూ సమీకరణ చేపట్టామని తెలిపారు. ఈ దశలో ఇప్పటివరకు మొత్తం 7 గ్రామాలకు గానూ 4 గ్రామాల్లో భూ సేకరణ ప్రారంభమైందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

====================

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారతదేశ యువతలో ఆత్మవిశ్వాసం, ధైర్యం, సేవా స్ఫూర్తిని స్వామి వివేకానంద ఆదర్శాలు రగిలించాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇక ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్వామి వివేకానంద నివాళులు అర్పిస్తూ... ఈ దేశ భవిష్యత్.. ధైర్యం.. స్వీయ-అవగాహన ఉన్న బాధ్యతాయుతమైన యువతపై ఆధారపడి ఉందని అన్నారు.

====================

సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో రైల్వే అధికారులు మరికొన్ని ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. విశాఖ - విజయవాడ మధ్య 12 జన్ సాధారణ్ (అన్ రిజర్వ్‌డ్) రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈనెల 12, 13, 14, 16, 17, 18 తేదీల్లో ఈ రైళ్లు సర్వీసులందించనున్నాయి. 08567 నెంబరుతో విశాఖ - విజయవాడ జన్‌సాధారణ్ ఎక్స్‌ప్రెస్ రైలు నిర్ణీత తేదీల్లో విశాఖలో ఉదయం 10 గంటలకు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకోనుంది. అలాగే తిరుగు ప్రయాణంలో 08568 నెంబరుతో విజయవాడలో సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు బయల్దేరి రాత్రి 12 గంటల 35 నిమిషాలకు విశాఖ చేరుకోనుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్ల మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయి.

====================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ రోజు చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ-62 రాకెట్ ప్రయోగంలో అంతరాయం ఏర్పడింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్) నుంచి ఈ రాకెట్ ను ఉదయం 10 గంటల

18 నిమిషాలకు ఇస్రో ప్రయోగించింది. `ఈఓఎస్-ఎన్-1`తో పాటు భారత్, యునైటెడ్ కింగ్డమ్, థాయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న ఉపగ్రహాలను కూడా ఈ రాకెట్ తీసుకువెళ్లింది. ఈ ప్రయోగ వివరాలను ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పాత్రికేయులకు వెల్లడించారు. ప్రయోగం మొత్తం నాలుగు దశల్లో పూర్తి కావాల్సి ఉండగా... మూడవ దశ తర్వాత కొంత అంతరాయం ఏర్పడిందని, ఈ దశ చివరిలో రాకెట్ నిర్దేశించిన మార్గంలో వెళ్లలేదని, సమస్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నామని ఇస్రో ఛైర్మన్ తెలియజేస్తూ...

(వాయిస్ 15 సెకన్లు)

====================

డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాలు రెండో రోజు కూడా ఉత్సాహంగా కొనసాగాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మూడు రోజుల పాటు "సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ" పేరిట వివిధ పోటీలకు శ్రీకారం చుట్టింది. ఈ రోజు నిర్వహించిన డ్రాగన్ పడవల పోటీలను శాసనసభ్యులు బండారు సత్యానందరావు, అధికారులు ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

====================

కాకినాడ జిల్లాలో కోడి పందేలు పూర్తిగా నిషిద్ధమని, వాటిని నిర్వహిస్తే కఠిన శిక్షలు తప్పవని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో ఈ రోజు మాట్లాడుతూ... జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం-1960, ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం-1974 ప్రకారం కోడిపందేలు, జూదాలు శిక్షార్హమైన నేరాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమం, అటవీ శాఖలు సమన్వయంతో ఈ చట్టాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోడి కోడిపందేలు జరిగే అవకాశమున్న గ్రామాలు, ఖాళీ ప్రదేశాలు, ప్రైవేట్ భూములను ముందుగానే గుర్తించి తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

====================

విశాఖపట్నం సింహాచలంలో శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయ సన్నిధిలో శ్రీ నృసింహ చందన దీక్షల విరమణ కార్యక్రమం ఈరోజు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచే భారీగా దీక్షాపరులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకులు, వైదిక బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ఇరుముడి సమర్పణ, మాల విరమణ కార్యక్రమాలను నిర్వహించారు.

====================
====================